# ఎండమావులు

బుర్రా వెంకటసుబ్రహ్మణ్యం

"నీగదికి నేనువచ్చి అప్పుడే పదినిముషాలయింది."

"చూసేను"

"వచ్చానని తెలిసే ఇదంతా?...అయితే నన్ను వెళ్లి పొమ్మనా నీ అభిప్రాయం?"

"ఎందుకు వెళ్లిపోవడం?"

"ఎందు కేమిటి? నువ్విలా మాట్లాడకుండా కూర్చుంటే నిన్ను చూస్తూ కూర్చోనా నేను?"

"మాట్లాడేందు కేమీ లేదు."

"ఉన్నప్పుడే మాట్లాడుతూ ఉండేవాడవా పూర్వం?...ఎందుకింత మౌనంగానూ, విచారంగానూ ఉన్నావు?"

"విచారాని కేమీ కారణం లేదు."

"డబ్బువిషయమై చిక్కులా?"

"ఖర్చుకి డబ్బు లేకపోలేదు."

"మరేమిటి సంగతి?"

"ఏమీ లేదని చెప్తుంటే నే."

"నీపరీక్ష పోయిందని ఎవరైనా కబురుచెప్పేరా, సోమశేఖరం?"

"పరీక్ష పోవడం అంటూ ఉండదు. బాగా వ్రాసేను."

"ఏమిటిమరి నీబెంగ?"

"నాకేమీ బెంగ లేదు."

"అయినా చెప్పు. నేనేమైనా చెయ్యగలిగితే చేసిపెట్టాను."

"నువ్వు చెయ్యగలిగినదేమీ లేదు."

"అయితే ఏదో ఉందన్న మాటే బెంగ."

"కొంచెం ఉందిలే."

"ఏమిటో చెప్పు."

"ఏమనిచెప్పను, రామం, నీకు? నాలోకం అంతా తల్లక్రిందులైపోయింది."

"అంటే?"

"నా అంత దౌర్భాగ్యుడీలోకంలో లేడు."

"అంతమాటనకు."

"నిజంగా. రెండురోజులనుంచి నిద్రలేదు. ఒకటే విచారం."

"ఇంకా చెప్పు."

"ఎవరితోటీ మాట్లాడడం ఇష్టంలేదు. నలుగురిలోనూ వీధిలో నడవడానికికూడా మనస్కొప్పడం లేదు."

"అసలు జరిగిందేమిటి?"

"చెప్పనా?"

"ముఖ్యంగా."

"అది చాలాపెద్దకథ. నీకావిషయాలెన్నడూ చెప్పలేదు. మొదటినుంచీ చెప్పాలి... వినేందుకు ఓపిక నీకుందో లేదో."

"నాకు మరొకపనేమిటి?"

"అయితేవిను...... మూడేళ్లయింది, రామం, నేను కృష్ణయ్యగారింటికి చనువుగా వెళ్తూఉండడం మొదలుపెట్టి. వారిది బ్రహ్మసమాజపు కుటుంబం కనుక ఆయనతో ఒక్కరితోనే కాకుండా ఆయనభార్యతోనూ, ఆయనకూతురుతోనూకూడా నాకు పరిచయంకలిగింది. నేను మొదలు చూసినప్పుడు సత్యవతికి పదిహేడేళ్లు."

"సత్యవతంటే ఆయనభార్యా?"

"కాదోయ్... నువ్వు వింటున్నావా? సత్యవతి కృష్ణయ్యగారి కూతురు. ఆయన కొక్కత్తే కూతురు.

ఒక్క కొడుకుకూడా ఉన్నాడు. కాని అతను కుర్రాడు. అప్పటికి అయిదేళ్లుంటాయేమో."

"అప్పటికి అక్షరాభ్యాసం చేసేరా ఆకుర్రాడికి?"

"ఏమో ... బ్రహ్మసమాజపువాళ్లల్లో అక్షరాభ్యాసం ఉందో లేదో కూడా నాకు తెలియదు."

"అక్షరాలు తెలియకుండానే పండితులైపోతారా వాళ్లు?"

"అదంతా ఎందుకిప్పుడు, రామం? ఆకుర్రాడికి అక్షరాభ్యాసం అయిందే అనుకో ...ఎరుగక చెప్పేను ఆకుర్రాడిసంగతి."

"ఆకుర్రాడిపేరు చెప్పలేదునువ్వు"

"కేశవచంద్రుడు ......ఇప్పటికైనా సంతృప్తుందా?"

"ఇకనుచెప్పు"

"నేను మొదటచూసినప్పుడు సత్యవతికి పదిహేడేళ్లు. చాలాఅందమైన పిల్లఅని మొదటినుండీ తెలుసును నాకు. తను నాతోకూర్చుని ఆవేళసాయంత్రం రామ్ మోహన్ రాయ్‌గురించి మాట్లాడేసరికి తనంతటి తెలివైన పిల్ల ఈలోకంలో ఎవత్తేలేదని నేను నిశ్చయించుకున్నాను."

"అంతకంటె తెలివైనవారు లేరని నిశ్చయించుకునేందుకు అప్పటికీ ఇప్పటికీ మిగిలిన పిల్లల్ని ఎవరినైనా చూసేవా?"

"అప్పటికి సత్యవతితోతప్ప మరి ఏఆడపిల్లతోనూ మాట్లాడలేదు నేను."

"అదే అనుకున్నానులే. ఎంతవరకూ చదువుకున్నారావిడ?"

"మెట్రిక్యులేషన్ వరకూ చదువుకుని ఎందువల్లనో అక్కడ మానేసింది......నెమ్మదిగా మాపరిచయం వృద్ధిపొందింది."

"ఆసత్యవతన్నావిడతో పరిచయమా?"

" అవును. మొదటిసారివచ్చి వెళ్లిపోతుంటే మళ్లీఎప్పుడైనా రమ్మని కృష్ణయ్యగారు చెప్పేరు నాతో. రెండవసారి వచ్చి వెళ్లిపోతుంటే కృష్ణయ్యగారిభార్య వీలైతే మళ్లీరమ్మని నన్నడిగేరు. మూడవసారి వచ్చివెళ్లిపోతుంటే సత్యవతే నన్ను మళ్లీరమ్మంది. నాల్గవసారి నేనువచ్చి వెళ్లిపోతుంటే ముగ్గురూ కూడా నన్ను మళ్లీరమ్మనక్కరలేదని గ్రహించేసేరు. ఆతర్వాత క్రొత్తలో వారుముగ్గురూ నేనూ కూర్చుని హిందూమతంలో ఉన్నటువంటి అసందర్భాలన్నిటి గురించీ మాట్లాడేవాళ్లం. కొంతక్రొత్తతీరేక ఆయన పనిమీద ఊళ్లోకివెళ్లేవారు. తల్లీ కూతురూ నేనూ హిందూసంఘంలో ఉన్నటువంటి అన్యాయాలన్నిటి గురించీ చర్చచేసేవాళ్లం. ఇంకా కొన్నాళ్లయాక సత్యవతీ నేనూ మట్టుకు కూర్చుని ముందుముందు చదువులయాక నేనేమి చెయ్యాలనుకున్నానో, ముందు ముందు తనేమి చెయ్యాలనుకుందో ఇటువంటి విషయాలు మాట్లాడుకునేవాళ్లం."

"అంటే......ఇద్దరూ వేరువేరుగా చెయ్యాలనుకున్న విషయాలేనా?"

"రామం, నువ్వెప్పుడూ ఇటువంటి వికటపు మాటలే మాట్లాడుతూ ఉంటావుకదా ...... అదేమీ కాదు. మతాన్నీ, సంఘాన్నీ ఒక మూలపెట్టి ఊరికా మాసంగతులే మాట్లాడుకునేవాళ్లం. ఏ సాయంత్రం అయినా సత్యవతిని నేను చూడకపోతే నా కారాత్రి నిద్రపట్టేదికాదు. ప్రొద్దున్న లేచీలేవగానే కృష్ణయ్యగారింటికి వెళ్తేనేకాని పిచ్చెత్తినట్టుండేది. అప్పుడు 'నిన్న కనబడనేలేదే' అంటూ సత్యవతి నాకేసి అతి కోపంగా చూసేది. ఆకాలంలో కొంత పిచ్చెత్తినట్టున్నప్పటికీ ఎంతో సరదాగా ఉండేవి రోజులు నాకు... నన్నుగురించీ, నాచదువులగురించీ ఎంతో శ్రద్ధతీసుకుని ఎన్నో ప్రశ్నలు వేస్తూఉండేది సత్యవతి."

"అదీ సరదాయేనా నీకు? ఈఆడవాళ్లకి అక్కరలేని అంశం లేదోయ్. మొన్న మానాయనమ్మ నన్ను ......ఏమిటి చెప్పబోతున్నావు?"

"నెమ్మదిగా మా స్నేహం ముదిరిపోయింది. ఒకనాడు, నన్నెరుగున్న అయిదారునెలలలో సత్యవతి నన్ను నాపుట్టినరోజు ఏదని అడిగింది. నేనింకెతనానికి తప్పురోజు చెప్పేను."

"అసలు నీపుట్టిన రోజు ఏది?"

"జూలై నెల ఇరవైయవతారీఖు. డిసెంబరునెల పదహారవతారీఖని చెప్పేను. డిసెంబరు పదహారవతారీఖున తన ఇంటికి వెళ్ళేసరికి నాచేతిలో ఒకపుస్తకం పెట్టింది. లోపల చూద్దును కదా, పుట్టినరోజుకి బహుమానం అని అందమైన అక్షరాలు చెక్కబడిఉన్నాయి. కొంతసేపటివరకూ బోధపరచుకోలేకపోయాను. నేను ......అప్పటినుండి ఈరోజువరకూ అది నాపుట్టిన రోజు కాదని చెప్పేందుకు నాకు మనస్కొప్పలేదు. మూడేళ్ళ బట్టి సత్యవతి డిసెంబరునెలలో ఏదో ఒక బహుమానం నాకిస్తోంది."

"క్రిందటి సంవత్సరం నీకేమిటిచ్చిందావిడ?"

"ఒక పార్కర్ కలం."

"అదృష్టవంతుడవోయ్! నేనే నువ్వైయుంటే ఈపిల్లవంటి పిల్లల్ని మూడువందల అరవైమందిని చేరదీసి ఒక్కొక్కరికి ఒక్కొక్కరోజు నాపుట్టినరోజని చెప్దును...మంచిపన్నాగమే అంటావా?"

"ఈపన్నాగాలే నాకొంపతీసినవి......వాళ్ళందరి పుట్టినరోజులకీ నువ్వివ్వవలసిన బహుమానాలో?"

"అదొకటి కూడానా?"

"నేను చెప్పేదంతా వినుమరి...... ఒకరోజున రమారమి రెండేళ్ళక్రిందట కృష్ణయ్యగారింటికి నేను వెళ్ళగానే వాళ్ళంతా మంచిబట్టలుకట్టుకుని వాళ్ళ గుర్రపుబండి ఎక్కబోతున్నారు. నన్ను చూడగానే నేనుకూడా వాళ్ళతో వెళ్ళకతప్పదన్నారు. ఎక్కడ కనడిగితే నాటకానికన్నారు. నాకు నాటకాలంటే తలనొప్పి. అందులో మననాటకాలు చెప్పాలా? రావణాసురుడివేషం వెయ్యవలసినవాడికి రవికతొడగి సీతగా పంపిస్తారు. వాడు సీతగావచ్చి ఏవో కూనిర్నాగాలో, 'కూనీ' రాగాలో తీస్తుంటే సభలో ఉన్న పెద్దమనుష్యులు నాటకం నిలిపేసి వాడిచేత రాముడు పాడవలసిన పాటలన్నీ పాడించేస్తారు....అందువల్ల వాళ్ళతో నే నారోజున నాటకానికి రానన్నాను. కాని సత్యవతి మూతిముడిచేసరికి ఇటూఅటూ చూసి నేనూ ఎక్కను బండి. నాటకశాలలో పడ్డాక కుర్చీలలో కూర్చునేటప్పుడు కొన్నివిచిత్రాలు జరిగేయి."

"ఏమిటా నాటకం?"

"ఏదో ఒకటి. 'హరిశ్చంద్ర' అనుకో. లేకపోతే 'లవకుశ' అనుకో. అదంతముఖ్యమైనవిషయం కాదు... కూర్చునేటప్పుడు కేశవచంద్రుడూ, కృష్ణయ్యగారి భార్యా ముందు లోపలికి వెళ్ళేరు. కృష్ణయ్యగారు కొంతసేపటివరకూ సత్యవతి ఆయనకీ భార్యకీ మధ్యని కూర్చుంటుందనుకుని, సత్యవతిని తల్లి వెంట వెళ్ళనిచ్చేందుకు వెనకకి నిలిచిపోయారు. ఎంతకీ సత్యవతి తల్లి వెంట వెళ్ళకపోయేసరికి ఆయనే ముందు లోపలికి వెళ్ళేరు. ఆఖరికి సత్యవతికి ఒకపక్కని నేను కూర్చున్నాను. పాపం, కృష్ణయ్యగారు నిముషనిముషానికీ సత్యవతితో 'అక్కడకంటె నేను కూర్చున్నచోట నీకు బాగాకనిపిస్తుందేమో' అంటుంటే, 'ఫరవాలేదు నాన్నా, ఇక్కడే బాగుంది' అంటూ ప్రదర్శనం జరిగినంతసేపూ నాపక్కనే కూర్చుంది."

"తల్లితండ్రులప్రేమ ఎటువంటిదో చూడు! కూతురికి నాటకం సరిగ్గా కనబడదేమో అన్నవిచారమే కాని స్థలాలు మార్చుకుంటే తనకే ఆనాటకం కనబడదన్న విచారం లేదుకదా ఆయనకి."

"అంతేకాదు. దీపాలన్నీ ఆర్పేసినతర్వాత నాటకం మధ్యలో రెండుమూడుమాట్లు ఎవరో నాచెయ్యి తడిమినట్టయింది."

"ఎవరో తెలియలేదా?......నీ రెండవపక్కని ఎవరు కూర్చున్నారు?"

"జ్ఞాపకం లేదు."

"అయితే నీ సందేహం......?"

"సందేహం లేదులే...... ఆ సమయాలలో కృష్ణయ్యగారు చూస్తారేమో అని నాకెంతో కంగారు. సత్యవతికి ఆ కంగారున్నట్టు నాకు తోచలేదు. అయినా, నేనూ ధైర్యం తెచ్చుకుని చీకట్లో తన చెయ్యి రెండుమూడుమాట్లు గట్టిగా పట్టుకున్నాను. నాటకం అయిపోయాక అందరూ అది అసహ్యంగా ఉందంటుంటే సత్యవతిమట్టుకు ఇంతమంచినాటకం తనెప్పుడూ చూడలేదని పొగడడం మొదలుపెట్టింది. అదేకాక ఊరికి మళ్లీ ఎప్పుడైనా నాటకంవస్తే నేను మళ్లీ వాళ్లతో వెళ్లకతప్పదని నాదగ్గర మాటపుచ్చుకుంది. అంతేకాని ఆరాత్రి నాటకశాలలో మాచేతులు నడిపిన నాటకంగురించి తనూ మాట్లాడలేదు, నేనూ మాట్లాడలేదు."

"ఆచేతులాటని నాటకంలో మొదటి అంకం అనుకొని నాటకం యావత్తూ అనకు."

"ఏదో ఒకటి ...ఇలాఉండగా ఈనాటకంజరిగిన కొన్నినెలలకి గ్రామంనుంచి మానాన్న నాకొక ఉత్తరంవ్రాసేడు — నాపెళ్లిముహూర్తం నిశ్చయం అయిందనీ, నామేనమామ కూతురు నాకు పెళ్లాంకాబోతుందనీ, నేనావేళకి శెలవుపుచ్చుకుని రావాలనీ."

"సరిపోయింది! దీనికిముందు కృష్ణయ్యగారితో మీనాన్నగురించీ, మీకుటుంబంగురించీ ఎప్పుడైనా మాట్లాడేవా?"

"మాట్లాడకేమి? మాకుటుంబంగురించీ,మాఆస్తులగురించీ మొదట్లోనే చెప్పడంఅయింది. అప్పుడుకృష్ణయ్యగారి భార్య నన్నడిగినప్రశ్నలు ఇన్నీఅన్నీకావు... ఆఉత్తరంమాట నేను కృష్ణయ్యగారింట్లో చెప్పేసరికి కృష్ణయ్యగారు భార్యకేసి చూసిచూసి సావిట్లోకి వెళ్లిపోయారు. సత్యవతి మాట్లాడకుండా నాకేసైనా చూడకుండా పక్కగదిలోకి వెళ్లిపోయింది. కృష్ణయ్యగారి భార్య ఆవిడకుర్చీ నాకు దగ్గరగాలాగి "అంతా బాగానే ఉందికాని, ఊళ్లోఅందరూ సత్యవతిని నువ్వు పెళ్లాడుతావని అనుకుంటున్నట్టు నీకు తెలియదా?" అని అడిగేరు. నేనామాటవినలేదని జవాబు చెప్పేను. 'ఇన్నిరోజులబట్టీ మా ఇంటికి అంతతరచుగానూ, అంత చనువుగానూ రావడంలో అర్థం ఏమిటి?' అని ప్రశ్నించారావిడ. నే నీవిషయాలన్నీ అంత జాగ్రత్తగా ఆలోచించుకోలేదని సమాధానంచెప్పేను. ఆడపిల్లలు పెద్దవాళ్లై పెళ్లిళ్లుకాకుండా ఉన్న ఇళ్లకి ఇంతతరచుగా ఈడుగల మొగపిల్లలు వస్తే లోకం అంతటా ఒకటేఅర్థం అన్నారావిడ. దీర్ఘాలోచన చెయ్యకుండా బుద్ధిపొరపాటున చేసిన పని కనుక క్షమించమని కోరే నావిడని. క్షమార్పణలతో పని లేదు కాని సత్యవతిని నేను పెళ్లిచేసుకోకతప్పదన్నారావిడ. మానాన్న చాలా గట్టిమనిషనీ, తనమాట నేను జవదాటలేననీ బోధపరుచబోతుంటే పక్కగదిలో పెద్దపెట్టున సత్యవతిఏడుపు వినపడింది. 'అయ్యో, అయ్యో' అంటూ కృష్ణయ్యగారి భార్య ఆగదిలోకి పరుగెత్తేరు. నేనూ పెళ్లి గుమ్మంలో నుంచున్నాను. తల్లీ కూతురూ కలసి ఘోరమైన ఏడుపులు మొదలెట్టేరు. కృష్ణయ్యగారు సత్యవతిని నేను పెళ్లి చేసుకోక తప్పదన్నారు. ఆహడావిడిలో 'సరే' అన్నాను. ఆతర్వాత నేను పడ్డబాధలు ఇన్నీ అన్నీకావు. ఎలాగో ఒకలాగు మానాన్నచేత మా మేనమామసంబంధం అంత మంచిదికాదని ఒప్పించేను. వస్తున్న సంబంధాలన్నీ కూడా పడగొట్టేను. కృష్ణయ్యగారింట్లో మట్టుకు సత్యవతిని నేను పెళ్లిచేసుకుంటానని స్థిరపడిపోయింది. చదువులయిపోయి ఉద్యోగం దొరికేవరకూ పెళ్లికి బలవంతపెట్టం అన్నారు కృష్ణయ్యగారూ, భార్యా కూడా. ఉద్యోగం అయేవరకూ ఈసంగతులేమీ లోకానికి తెలియనివ్వకూడదని వారిని నేను బ్రతిమాలుకున్నాను. 'సరే' అన్నారు. మానాన్నకేవిధంగానైనా ఈకబురు తెలిసిపోయిందంటే నాబ్రతుకు చెప్పాలా?"

"ఇదా నీబెంగ?"

"ఇంకా విను. అసలుసంగతి చెప్పనేలేదు."

"అదేమిటి?"

"వినుమరి. కృష్ణయ్యగారింటివాళ్లకిమాత్రం సత్యవతిని నేను పెళ్లిచేసుకుంటానని తెలుసును కాని ఊళ్లో ఎవరికీ తెలియదు."

"మరి కృష్ణయ్యగారి భార్య ఊళ్లోఅందరూ ఆమాట అనుకుంటున్నారని చెప్పేరన్నావు?"

"ఆవిడ కానిముషంలో అలాతోచింది. కాని ఎవరికీ తెలియదు. రెండేళ్ల క్రిందట నరసింహంపంతులు గారు ఈఊరికి డెప్యూటీకలెక్టర్ గా వచ్చారు. చిన్న తనంలో ఆయన కొడుకు సాంబమూర్తీ, నేనూ కలసి చదువుకున్నాం. అందువల్ల నేనంటే ఆయనకి కొంత గారాబం. సాంబమూర్తి చెన్నపట్నంలో చదువు కుంటున్నాడు. సాంబమూర్తిచెల్లెలు, పాపం, చిన్న తనంలో కాపురానికి వెళ్లకుండానే భర్త చనిపోవడం వల్ల తల్లితండ్రులతో ఉండిపోయింది. పాఠశాలలకు వెళ్లీ, కళాశాలలకు వెళ్లీ చదువుకోలేదు. ఇంట్లోనే చాలావరకు నేర్చుకుంది."

"ఆవిడ పేరేమిటి?"

"ఇందిర. చాలాతెలివైనదీ, చాలానెమ్మదైనదీ. ఈసారి చూడగానే ఎందువల్లనో ఇందిర నాకు ప్రత్యేకంగా నచ్చింది. ఎన్నోసార్లు నేను వారింటికి వెళ్లగానే తను సావిట్లోంచి లోపలికి వెళ్లిపోయేది. నరసింహం పంతులుగారు 'పరెవరూ కాదు. మన సోమశేఖరమే' అన్నాకూడా మళ్లీ కనబడేది కాదు. వారీఊరికి వచ్చిన అయిదారునెలలవరకూ నాతో ఇందిర సమంగా మాట్లాడనే లేదు. అప్పుడైనా వేసవికాలపు శలవలకి రెండు నెలలూ సాంబమూర్తి ఈ ఊళ్లో ఉండడంవల్ల తన అన్నకీ నాకూ ఉన్న చనువుచూసి నన్నొక పరాయి వాడినిగా ఎంచడం మానేసింది. అంతవరకూ పరాయి వాడినే. నాతోమాట్లాడే క్రొత్తలో తల వంచుకుని ముక్తసరిగా జవాబులు చెప్పేది. నేను కూడా ఇందిరతో మాట్లాడేందుకు సిగ్గుపడేవాడిని. సత్యవతిదగ్గర ఎంతధైర్యంగా మాట్లాడేవాడినైనా ఇక్కడ పెళ్లి కూతురులాగ బెదరిపోయేవాడిని. ఇందిరతో సహవాసం కుదిరినకొలదీ తనంటే నాకు అభిమానం, ప్రేమా హెచ్చిపోయాయి."

"మరి......ఆసత్యవతన్నావిడ మాటో?"

"అదే చిక్కు. కృష్ణయ్యగారింటికి ప్రతి రోజూ వెళ్లడం మానేసి రెండుమూడు రోజులకి ఒకసారి వెళ్లేవాడిని. వెళ్లినప్పుడుమట్టుకు నా నడతలో ఏమీ మార్పుకనబడకుండా చూసుకునేవాడిని. రెండు మూడుసార్లు నేను రోజూ రావడంలేదని సత్యవతి చికాకుపడింది కాని ఏవో మాయమాటలు చెప్పి తప్పించుకున్నాను."

"ఈ...సత్యవతన్నావిడకి ఈ...ఇందిరన్నావిడసంగతి తెలియదా?"

"చాలాకాలంవరకూ తెలియదు. కాని ఒకసంవత్సరక్రిందట సాంబమూర్తి శలవలకి ఈఊళ్లోఉండగా నరసింహంపంతులుగారూ ఇందిరా సాంబమూర్తీ నేనూ ఊరిబయటికి షికారుకి వెళ్తే కృష్ణయ్యగారి గుర్రపు బండి మాకు త్రోవలో కనబడింది. నన్నుచూసి బండి ఆపి వాళ్లంతా దిగేరు. అప్పుడు రెండుకుటుంబాలకీ ఒకరితోఒకరికి పరిచయంకలిపేను. మొన్నాడు కృష్ణయ్యగారింటికి వెళ్లినప్పుడు సత్యవతి ఇందిరగురించి అడుగవలసిన ప్రశ్నలన్నీ నన్నడిగింది. ఆకుటుంబంతో నాకు సంబంధంఅంతా సాంబమూర్తికీ నాకూ ఉన్న చిరకాల స్నేహం అనిబోధపరచాను. ఇందిర నాతో మాట్లాడనైనా మాట్లాడదన్నాను."

"నమ్మిందీ ఈ...సత్యవతన్నావిడ?"

"నమ్మిందనే ఆవేళ అనుకున్నాను. ఏమైనా అంతమరీ అపనమ్మకం పెట్టుకోలేదు. కాని కొంతవిచిత్రంగా ప్రవర్తించింది. ఇందిర తనకి చూడగానే మంచి పిల్లలా కనబడింది కనుక ఇందిరతో తనకి స్నేహం కుదిర్చిపెట్టాలని నన్నుకోరింది. ఏమి అనడానికీ తోచక సాంబమూర్తితోచెప్పిచూస్తానని జవాబిచ్చాను. ఇదయిన వారంరోజులలోపున సత్యవతి వచ్చి ఇందిరని చూడడం, ఇందిరవెళ్లి సత్యవతిని చూడడం రెండూ జరిగేయి."

"ఇద్దరూ గొప్పస్నేహితులయారన్నమాట."

"ఆడపిల్లలస్నేహాలకేమిటిలే. ప్రొద్దున్న ప్రాణాంతకస్నేహం. సాయంత్రానికి సంపూర్ణవిరోధం...

మొత్తానికి ఇద్దరూ స్నేహంగానే ఉండేవారు. సత్యవతి తనూ నేనూ పెళ్లి చేసుకుంటాం అని ఇందిరతో చెప్పదనిమట్టుకు రూఢిగా నాకు తెలుసును. ఆవిధంగా మాటపుచ్చుకున్నాను... ఇలాఉంటూఉండగా సాంబమూర్తి మళ్లీ చెన్నపట్నంపోయాక కూడా నరసింహం పంతులుగారింటికి యథాప్రకారంగా వెళ్తూ ఇందిరతో చనువుగా మాట్లాడుతూ ఉండేవాడిని. ఎన్నాళ్లవరకో ఇందిరకి నాప్రేమ ఎలాసూచించడమో నాకు తెలిసిందికాదు. ఇందిర పూర్వంలా కాకుండా నేనువెళ్లగానే వచ్చి నాదగ్గరకూర్చుని సరదాగా మాట్లాడుతూ ఉండేది. అప్పుడప్పుడు నరసింహంపంతులుగారు కూడా మాతో కూర్చునేవారు. ఒకసారి ఆయన లేనప్పుడు ఇందిరకి చదవమని ఒకపుస్తకం ఇచ్చాను. అందులో తనకి నేనొక ఉత్తరం వ్రాసిపెట్టేను. ఉత్తరం కవరులో పెట్టి అంటించేసి కవరుమీదమట్టుకు ఎవరి పేరూ వ్రాయలేదు. పుస్తకం తిరగేస్తూ అందులో ఏదో ఉత్తరం ఉండిపోయిందంటూ ఇందిర నాకాఉత్తరం ఇచ్చెయ్యబోయింది. దానిని మళ్లీ పుస్తకంలో పెట్టేస్తూ తను చదువవలసినదానిలో అదీ ఒకభాగమే అన్నాను. రహస్యం వెంటనే గ్రహించింది. నాకేసి కోపంగాచూసి మాట్లాడకుండా ఉత్తరం పైకితీసి నావైపు తోసేసింది. కాని ఆవేళ వెళ్లిపోబోతూ ఆ ఉత్తరాన్ని మళ్లీ తనతో ఉండిపోయే పుస్తకంలో నేను పెట్టుంటే చూసికూడా చూడనట్టు నటించి ఆపుస్తకం తీసుకుంది."

"నాకేమీ బోధపడడం లేదు. ముందర తీసుకోకపోవడం ఎందుకు? తర్వాత తీసుకుంటూ తెలియనట్టు నటించడం ఎందుకు? తీసుకోవాలని ఉద్దేశ్యం ఉంటే ముందే తీసుకోకూడదా? లేకపోతే మానెయ్యకూడదా?......ఓహో! ఇప్పుడు బోధపడింది."

"ఏమిటి?"

"తండ్రిగారికి చూపించి నీమీద ఫిర్యాదు చేసేందుకు తీసుకుంది ఆ......ఇందిరన్నావిడ. అంతేనా?"

"అబ్బెబ్బే. ఆయనకి చూపించడానికి కాదు' తను చదవాలనే తీసుకుంది...ఆఉత్తరంలో నేను నా హృదయంలో ఉన్న ఆవేశం అంతా దొర్లించేసేను. తను నాకంటబడిన మొదటిరోజునే పరవశుడనై పోయానన్నాను. తనులేని జీవితం జీవితం కాదన్నాను. నేను సాంఘీకనిర్బంధనలు పాటించేరకం కానన్నాను. తను నన్నేమి చెయ్యమంటే అది చేస్తానన్నాను. నిద్రాహారాలు లేక శల్యమైపోతున్నా నన్నాను. ఇంకా ఏమిటేమిటో వ్రాసేను."

"ఒక్కమాట. నువ్వు వ్రాసినదంతా నిజం అనుకుంటూనే వ్రాసేవా?"

"అదా నీప్రశ్న? ప్రేమయొక్క దౌర్బల్యంలో వ్రాసిన ఉత్తరాలకి 'నిజం', 'అబద్ధం' అంటూ రెండు వేరువేరుమాటలున్నాయా?"

"ఊరికా అడిగేనులే. నాకీఉత్తరాలసంగతి ఏమితెలుసును? నెలకొకసారి మానాన్నకి డబ్బుకోసం తప్ప మరే ఉత్తరాలూ వ్రాసినపాపాన్ని పోలేదు."

"ఆ ఉత్తరం ఇందిరకిచ్చిన రాత్రి నాకు నిద్రలేదు. చదివి ఏమనుకుందో అని కంగారు. మొన్నాడు ప్రొద్దున్న తన ఇంటికి వెళ్దాం అనుకుంటే ధైర్యం చాలలేదు. సాయంత్రంకూడా వెళ్దామా వద్దా అనుకుంటూ ఆఖరికి గుండె నిబ్బరంచేసుకుని వెళ్లేను. వీథి సావిట్లో నరసింహంపంతులుగారు కూర్చున్నారు. నన్నుచూపి కూర్చోమనైనా అనలేదు. దానితో హడిలిపోయాను. పదినిముషాలయాక ఏవేవో సామాన్యమైన మాటలుచెప్పి, ముందటి రాత్రినుండీ ఇందిర ఏడుస్తూ పడుకుందనీ, ఎంత ఓదార్చినా ఏడుపుమానడం లేదనీ, ఇంట్లో అందరూ మతిపోయినట్టున్నారనీ చెప్పేరాయన. ఆయనామాట చెప్పేసరికి నాబెంగ నూరింతలయిపోయింది. ఒక్కటే సుగుణం కనబడింది నాకు. ఇందిర నా ఉత్తరం తండ్రిగారికి చూపించలేదని తోచింది......మర్యాదగా ఏవో రెండుముక్కలు చెప్పి వెళ్లిపోబోతుంటే, ఏమి బుద్ధిపుట్టిందో ఆయనకి

లోపలికివచ్చి ఇందిర నొకసారిచూసి మాట్లాడివెళ్లిపోతున్నారు. నాకంగారు చెప్పాలా? ...లోపలికివెళ్లేను."

"ఎలావెళ్లి మాట్లాడగలిగేవోయ్? నేనే ఆఅవస్థలో ఉంటే ఆనిముషం నాప్రాణం పోయుండును."

"ఏమిటి చెయ్యడంమరి? తప్పనిసరిగా వెళ్లేను. జుట్టు విరబోసుకుని రెండుమూడునెలలు తిండీ నిద్రా లేనిదానిలా ఇందిర పక్కలోపడుంది. నరసింహం పంతులుగారి భార్య, పాపం, పాలు త్రాగమని బ్రతిమాలుకుంటున్నారు. మమ్మల్ని చూడగానే ఇందిర తలగోడవైపు తిప్పేసింది. 'సోమశేఖరం వచ్చినా కూడా ఇలా అసందర్భంగా ఉంటే ఎలా ఇందిరా?' అన్నారాయన. నేను కొంతసేపటివరకూ మాట్లాడలేదు. ఆలోచించి ఆలోచించి ఆఖరికి 'ఊళ్లో చాలా జ్వరాలున్నాయి. ఇది జ్వరమేమో. వైద్యుడిని పిలిపించారా?' అన్నాను. నేనావిధంగా మాట్లాడినప్పుడు ఇందిర నామీదమోపిన చూపు నాజన్మమున్నంతకాలం మరచిపోలేను. నానటనచూసి అది కోపమో ఆశ్చర్యమో ఆనందమో ఇప్పటికింకా నేను చెప్పలేను...మొన్నాడు వెళ్లే తండ్రీకూతురూ సావిట్లో కూర్చున్నారు. ఇందిర నాతో మాట్లాడింది కాని ఇంకా కొంతసిగ్గుపడుతోందని గ్రహించాను. నేనుమట్టుకు మామూలుగానే మాట్లాడేను. తర్వాత రెండురోజులయాక నేను వెళ్లినప్పుడు ఇందిర ఒక్కతే ఉంది. నేనిచ్చినపుస్తకం చదివేసేనంది. 'అంతా చదవడం అయిందా?' అనడిగేను. 'అంతా చదవడం అయింది' అని జవాబిచ్చింది. ఆపుస్తకం తనకి చదవడాని కివ్వడం పొరపాటేమోనని ఇన్నాళ్లూ బెంగపెట్టుకున్నానన్నాను. పొరపాటేమీ లేదంది. లోపలికి వెళ్లి ఆపుస్తకం తెచ్చి నాకిచ్చేసింది. అందులో నాఉత్తరాని కొకప్రత్యుత్తరం ఉంది."

"ఏమిటో?"

"ప్రత్యుత్తరం"

"నిజంగా? ఏమి పన్నాగాలు! ఏమి దారుణం! ఈకాలపు ఆడకుర్రజట్టంతా ఇంతే? మానాయనమ్మతో ఈమాటచెప్తే, వైకుంఠఏకాదశివరకూ బ్రతికి ఆవేళచచ్చిపోవాలనుకుంటున్నది, ఈవాళే చచ్చిపోతుంది...ఏమిటుందా ప్రత్యుత్తరంలో?"

"తనకీ నేనంటే అభిమానమేననీ, నన్నుచూసినప్పటినుండీ తనకికూడా నాకు స్నేహితురాలనవాలన్న కోరిక కలిగిందనీ, ఇన్నాళ్లూ తనంటే నాకు ప్రత్యేకమైన ప్రేమలేదని నిరాశచేసుకున్నాననీ, తనజీవితానికి నేనిప్పుడొక అర్థం తెచ్చిపెట్టేను కనుక తనఆనందానికి అంతులేదనీ—కాని, తనజీవితంలో స్నేహభావానికి తప్ప మరొకభావానికి చోటులేదనీ వ్రాసింది."

"తర్వాత ఏమిటి చేసేవు నువ్వు? అన్నట్టు ఆ... సత్యవతన్నావిడ సంగతేమిటి?"

"చెప్పేదంతా వినుమరి. ఎలాగైనా ఇందిరని నేను పెళ్లిచేసుకోవాలని నిశ్చయించుకున్నాను. ఈ ఉత్తర ప్రత్యుత్తరాలు జరిగినతర్వాత ఇందిరతో కూర్చొని మాట్లాడడం, ఇందిరకి ఉత్తరాలు వ్రాయడం ఇందిర నాకు వ్రాసిన ఉత్తరాలు చదువుకోడం నాకెంత ఆనందం కలుగజేసేవో నేను చెప్పలేను. అనుభవించాలికాని వర్ణించడానికి వీలులేదు. సత్యవతి నెలా తప్పించుకు ఇవతలపడడం అన్నబాధలో పడ్డాను. నాకేమార్గం కనబడలేదు. రాత్రింబొగళ్లదొక్కటే ఆలోచన. ఈఏడాదితో నాచదువు లయిపోతే ఒక సంవత్సరంలోపున ఎక్కడో ఏదో ఉద్యోగం సంపాదిస్తాననీ, ఉద్యోగం దొరకిన మొన్నాడు పెళ్లిచేసుకుని తనతో కాపురం పెట్టాననీ సత్యవతిఅభిప్రాయం. ఉన్నబెంగలు చాలనట్టు సత్యవతికీ ఇందిరకీ, స్నేహం పెరిగిపోతోంది. సత్యవతి నాతో మాట్లాడినప్పుడల్లా ఇందిర తనతో నన్నుగురించి మరీ తరచుగా మాట్లాడుతుందని చికాకుపడుతూ చెప్పేది. ఇందిర ఇంటికి వీలైనంతవరకు వెళ్లవద్దని నన్ను ఆజ్ఞాపించేది. సత్యవతి ఎప్పుడూ నన్నుగురించే మాట్లాడుతుందనీ, సత్యవతిని నేనెన్నడూ పెళ్లిచూడకూడదనీ ఇందిర ఘోషపెట్టేది. ఏరోజు సత్యవతి ఇందిరకి నారహస్యం ఊదేస్తుందో అని పట్టరాని కంగారు నాకు."

"మరి......మాటవరసకి అడుగుతున్నాను. మీ తండ్రిగారు నిన్ను పెళ్లిచేసుకోమని బలవంతపెట్టడం మానేసేరా?"

"ఆయనా మానెయ్యడం? ఎలాగో 'మంచి మాటలుచెప్పి ఆరునెలలలో చేసుకుంటాననీ, వచ్చే ఏడాది చేసుకుంటాననీ, చదువులు సమాప్తి కానివ్వమనీ ఇంతవరకు తన్నుకొచ్చాను. రేపు గ్రామం చేరగానే ఏ అనాగరికపు అందవికారపు ఆంధ్రవనితనో అంటకట్టాడని నాకు తెలుసును."

"నీబాధలకి నాబాధ లేమూల కాని — మా నాన్న కూడా నన్ను చాలా బాధపెట్టున్నాడోయ్, సోమశేఖరం. నాకు చదువు అబ్బడం లేదని కనిపెట్టి మా మేనమామ తన కూతురుకోసం బెంగాల్ నుండి సిలోన్ వరకూ వేరే సంబంధాలు వెతికేడు. మా మేనమామకి బాగా చదువుకున్నవాడు కావాలి. ఎక్కడా దొరకలేదు. ఆఖరికి నేనే గతయాను. తప్పనిసరిగా నాకివ్వదలచుకున్నాడిప్పుడు. నాకా, ఇంతలో పెళ్లి చేసుకోవాలని లేదు. మంచికట్నం అనేసరికి మా నాన్న ఆనందపరవశుడై పోయాడు ...... అన్నట్టు నీ కథ చెప్పు."

"ఎంతవరకూ చెప్పేను?... అవును. వాళ్లిద్దరికీ స్నేహం హెచ్చిపోతోంది. సత్యవతిని వదలగొట్టుకునే సాధనం చిక్కడం లేదు. ఇలాఉండగా ఒకనాడుసాయింత్రం సత్యవతీ నేనూ కృష్ణయ్యగారిభార్య బండిలో వెళ్తుంటే బోగంకొంపలలోనుండి బయటపడుతూ మన వాడు లంకా సోమసుందరం కనబడ్డాడు. నీకు తెలుసును కాదూ వాడికి త్రాగుడూ, తదితరమైన దురభ్యాసాలూ పూర్తిగా అలవాటయాయని? ఆ సాయింత్రం వాడు జల్తారుఖండువా వేసుకుని మీసం దువ్వుకుంటూ తూలిపోతూ నడుస్తున్నాడు. వాడిని చూపించి 'ఆ త్రాగుబోతువెధవని చూడూ!' అంది సత్యవతి. వాడిని నేనెరుగుదునని చెప్పేను. ఒకానొక కాలంలో నాకు గొప్పస్నేహితుడన్నాను. అకస్మాత్తుగా తండ్రిచచ్చిపోయి చిన్నతనంలోనే డబ్బు చేతిలో పడడంవల్ల ఈవిధంగా పాడయిపోయాడని బోధపరచాను. అసహ్యించుకుంటూ, 'ఇంకా వాడితో నీకు స్నేహమేనా?' అని నన్నడిగింది సత్యవతి. తనాప్రశ్న వేసేసరికి నాచిక్కులు తొలగించుకునేందు కొక త్రోవ కనబడిందినాకు. అప్పటి కేదోసమాధానం చెప్పి, బండిలో ఆప్రశంస మానేసి ఇంటికి వెళ్లేక సత్యవతీ నేనూ ఇద్దరమే కూర్చున్నప్పుడు మళ్లీ సోమసుందరం గురించి మాటలు మొదలుపెట్టేను. రెండుమూడేళ్ల క్రిందటివరకూ నాకందరికంటే కూడా సోమసుందరం ముఖ్యస్నేహితుడనీ, ఇప్పుడు పూర్వకాలంలో ఉన్నంత గొప్పస్నేహితుడు కాకపోయినా ఇంకా స్నేహితుడే అనీ చెప్పేను. వాడితో పూర్తిగా స్నేహం మానుకుంటానని నన్ను వాగ్దానం చెయ్యమంది సత్యవతి. అటువంటి దరిద్రులని చూసి భరించలేనంది. అటువంటివాళ్లతో సహవాసం పెట్టుకోడం నామర్యాదకి లోటంది. మానేందుకు ప్రయత్నం చేసేటట్టు మాటిస్తానన్నాను. అలా పనికిరాదంది. 'చిన్నతనంనుండీ నా స్నేహితుడుకదా!' అన్నాను. వాడితో స్నేహం వదలుకోకపోతే నాతో నికమాట్లాడనంది. నాకు తను ముఖ్యమో వాడు ముఖ్యమో ఇప్పుడే నిశ్చయించుకోమంది. అయిష్టంగా వాగ్దానం చేస్తున్నవాడిలా నటించి వాగ్దానం చేసేను ...అదకూక నాపన్నాగం సాధించడం ప్రయత్నంలో పడ్డాను."

"ఏమిటా పన్నాగం?"

"వినుమరి. లంకాసోమసుందరంతో నేనెన్నడూ అంత స్నేహంగా ఉండలే దసలు. వాడు శుద్ధపోకిరీ. నే ననుకున్న దిదీ. చేసిన వాగ్దానం లెఖ్ఖచెయ్యక సత్యవతి చూస్తూ ఉండగా వాడితో జోస్తీగా తిరిగి నేనూ పాడయిపోయినవాడిలా నటిస్తే చూసి అసహ్యించుకుని సత్యవతి నన్ను వదలిపెట్టేస్తుందని ఆశ."

"భేష్! తెలివితేటలంటే అలా ఉండాలిమరి. మా మేనమామసంబంధం తప్పించుకునేందుకు నాకటువంటి పన్నాగం తోచాలంటే తోస్తుందా? ...ఏమి పన్నాగం! ఏమిపన్నాగం! ...అయితే ఏమయింది?"

"మన్నాదిబ్బాను! ...మొన్నాడు సోమసుందరం ఇంటికి వెళ్లేను. వాడు నన్ను అనుమానిస్తూ అనుమానిస్తూ లోపలికి రానిచ్చాడు. నేనెవరినో వాడికంత బాగా జ్ఞాపకం లేదన్నాడు. చిన్నతనంలో ఇద్దరం కలసి చదువుకున్నామనీ, ఈమధ్యనే తనమాట ఎవరో నాకు చెప్పడంవల్ల ఈవిధంగా వచ్చాననీ బోధపరచాను. మధ్యాహ్నం వాడింటి దగ్గర్లో ఉన్న ఉడిపి కాఫీ హోటల్‌కి తీసుకువెళ్లి దిట్టంగా తిండిపెట్టేను. అప్పటికి వాడు నాతో పరవాలేదనుకుని సరదాగా మాట్లాడడం మొదలుపెట్టేడు. సాయంత్రం చీకటిపడబోతూ ఉంటే షికారుకి వెళ్దాం రమ్మన్నాను. ఎక్కడకని వాడు నన్నడిగితే 'నువ్వు తరచుగా ఎక్కడకి వెళ్తే అక్కడకే' అన్నాను. నవ్వుతూ వాడు సిగరెట్టుముట్టించి జల్తారుఖండువా వేసుకొని మీసం దువ్వుతూ బయలుదేరేడు. నేనూ వాడివెంట పడ్డాను. వాడు వేరేవీథిని వెళ్లాలనుకుంటుంటే కృష్ణయ్యగారి వీథివెంట వెళ్దాం అన్నాను. సత్యవతీ, కృష్ణయ్యగారూ కూడా వీథిఅరుగుమీద రోజూ ఈవేళకి కుర్చీలువేయించుకుని కూర్చుంటారని నాకు తెలుసును. అనుకున్నట్టే వాళ్లు అరుగుమీద కూర్చుని కబుర్లుచెప్పుకుంటున్నారు. వీథిలో చీకటిగానే ఉంది కాని, ఏమాత్రమో కొంచెమైనా ఎరుగున్నవాళ్లని నడుస్తూఉండగా పోలికపట్టడం అసాధ్యం కాదు. సత్యవతి నన్ను పోలికపట్టింది. సోమసుందరాన్ని కూడా పోలికపట్టేఉండాలని నాకు తెలుసును. వెంటనే కృష్ణయ్యగారితో ఏదోచెప్పింది. ఆయన లేచి నుంచుని 'సోమశేఖరం! సోమశేఖరం!' అని పిలిచారు. పక్కనివాడు 'నిన్ను వాళ్లు పిలుస్తున్నారు. వినబడడంలేదా?' అన్నాడు. ఒకసారి వెనక్కి తిరిగి నేను సోమశేఖరాన్ని కానట్టు నడచి వెళ్లిపోయాను. మొన్నాడు కృష్ణయ్యగారింటికి నేను వెళ్లలేదు. ఆ తర్వాతరోజున వెళ్లగానే సత్యవతి అతికోపంగా నాకేసి తిరిగి 'మొన్నసాయంత్రం నాన్న నిన్ను పిలిస్తే ఎందుకు పలుకలేదు?' అనడిగింది. 'మొన్న సాయంత్రమా?' అన్నాను, ఆశ్చర్యపోతున్నవాడిలా నటిస్తూ. తనుచూసిన దంతా చెప్పింది. నేను నవ్వేసేను. 'ఆపోకిరీ వెధవతో మొన్న వెళ్తున్నది నువ్వే. నా కళ్లారా చూసేను' అంది. నేను తలనొప్పిగా ఉండి ఆరోజల్లా నాగదిలో పడుకున్నా నన్నాను. మొదట నమ్మలేదు. ఆఖరికి కృష్ణయ్యగారు, 'నే నా రోజుననే అన్నాను కాదమ్మా? సోమశేఖరం అయితే ఎందుకు మాట్లాడకుండా వెళ్లిపోతాడు? ఆచీకట్లో ఎవరినోచూసి సోమశేఖరం అనుకున్నాం' అన్నారు. ఆరో జావిధంగా గడచిపోయింది. సత్యవతి మట్టుకు మనస్సులో ఇంకా కొంచెం అనుమానం పెట్టుకుంది. ఇది జరిగిన కొన్నాళ్లకి కృష్ణయ్యగారు బ్రహ్మసమాజపు పనిమీద కలకత్తా వెళ్లేరు."

"బ్రహ్మసమాజపువాళ్ల మక్కామదీనాలు కలకత్తాయేనా?"

"అలా అనే చెప్పవచ్చును ...కృష్ణయ్యగారు ఊళ్లో లేనప్పుడు సత్యవతి తమ్ముడితో ప్రతిసాయంత్రమూ రైలుపట్టాలుదాటితే ఉన్న సరుగుడుతోటల దగ్గరికి గుర్రపుబండిలో షికారుకి వెళ్లేది. ఆమాట తెలిసి ఒకసాయంత్రం సోమసుందరాన్ని అక్కడికి తీసుకుపోయాను. ఇంకా సత్యవతి రాలేదు. వాడు సిగరెట్టు ముట్టించాడు. అంతవరకు ఎన్నడూ సిగరెట్లు నేను కాల్చలేదు. వాడిదగ్గర ఒకటి పుచ్చుకుని ఆసాయంత్రం నేనూ ఒకటి ముట్టించాను. పీల్చేటప్పుడు గుక్క తిరగకా, పొగ కళ్లల్లోకి వెళ్లి కళ్లమండీ బాధపడుతూ సిగరెట్టు కాలుస్తున్నాను. సఖంలో సత్యవతిబండివచ్చింది. మేము కూర్చున్నచోటుకి ఇరవైముప్ఫైగజాలదూరంలో బండివెళ్తోంది. సత్యవతి మమ్మల్నిద్దరినీ చూసింది, బాగా పోలికపట్టింది కూడాను. నేను గబాలున లేచి సోమసుందరంతో 'ఆబండిలోవాళ్లు మనని చూడకూడదు. ఈచెట్లసందులో దాంకోవాలి. లే' అన్నాను. వాడుఎందుకని ప్రశ్నలువెయ్యడం మొదలెట్టేడు. 'తర్వాత చెప్తానులే' అన్నాను, వాడు సణుగుకుంటూ నావెంట వచ్చాడు. సత్యవతి బండి నిలిపించింది. అంతాజరగవలసిన విధంగానే జరుగుతోందని సంతోషించాను. సోమసుందరంతో, 'మనం పరుగెత్తి ఊళ్లోపడాలి'

అన్నాను. వాడి చికాకు చూసి నవ్వుకోడమో, జాలి పడడమో నాకు తెలియలేదు. పాపం తొందర తొందరగా పరుగులువేస్తూ వాడు నాతో వచ్చాడు. సత్యవతి బండితిప్పించి మళ్లీ మావెంట బయలుదేరింది. మాదగ్గరకి బండి వచ్చినప్పుడు నాకేసి ఒకసారి చూసి కళ్లెర్రజేసి మరొకవైపు చూస్తూ కూర్చుంది. కేశవ చంద్రుడు నవ్వుతూ 'అక్కయ్యా ఆయనరుగో' అన్నాడు. బండి వెళ్లి పోయింది. సోమసుందరం పరుగులతో ప్రాణం పోయిందని నడివీథిలో చతికిలబడ్డాడు. వాడిని లేవదీసుకుని మంచి మాటలు చెప్పి వాడింట్లో దిగబెట్టి నేను నాగదికి పోయాను. మొన్నాడు కృష్ణయ్యగారింటికి వెళ్లేను. దూరంలో నన్ను చూసి సత్యవతి లోపలికి వెళ్లి పోయింది. సావిట్లో పదినిముషాలు కూర్చున్నాను. కృష్ణయ్యగారిభార్య మూలగానుంచుని ఒక్కక్షణం చూసీచూడనట్టుగా నాకేసి చూసి మళ్లీ వెళ్లిపోయారు. మరొక అయిదునిముషాలయాక ఆవిడ సావిట్లోకి వచ్చారు. నమస్కారం పెట్టి 'సత్యవతి ఇంట్లో ఉందా,?' అని అడిగేను. 'ఇంట్లోనే ఉంది కాని తీవ్రంగా తలనొప్పిగా ఉందట. నిన్నిప్పుడు చూడనంది' అన్నా రావిడ. 'చాలా ముఖ్యమైన విషయమై మాట్లాడాలి. ఒక్కసారి రమ్మని బ్రతిమాలుకుంటున్నానని చెప్పండి' అన్నాను. సత్యవతి వచ్చింది. మాట్లాడకుండా నాయెదురుగా ఒకకుర్చీలో కూర్చుంది. నేనూ ఏదో తప్పుచేసినవాడిలా నిజంగా బెదిరిపోయి చూస్తున్నాను. 'ఎందుకు నన్ను రమ్మనడం?' అంది ఆఖరికి. 'ఇన్నాళ్లూ నిన్ను చాలా మోసపుచ్చాను, సత్యవతీ. నా అంతదుర్మార్గుడీలోకంలో లేడు. నీఅంత పవిత్రమైన పిల్లకి నేనెన్నడూ తగినవాడిని కాను' అన్నాను. ఇంకా ఏమిటేమిటో గొణిగేను. 'ఆసాయంత్రం నాన్నా నేనూ చూసినది నిన్నేనా... ఆమనిషితో?' అని అడిగింది సత్యవతి. ఇటూ అటూ చూస్తూ అతిఅయిష్టంగా 'నన్నే' అని సమాధానం చెప్పేను. సోమసుందరం నాకన్నేళ్లబట్టి స్నేహితుడో చెప్పమంది. నాచిన్నతనంనుండీ ప్రాణస్నేహితుడు కనుక అతనితోపాటు నేనూ చెడ్డమార్గాలలో పడ్డాననీ, తప్పించుకుందాం అని ప్రయత్నంచేసినాకూడా తప్పించుకోలేక పోయాననీ, ఇన్నేళ్లబట్టీ కృష్ణయ్యగారినీ తననీ ఈవిధంగా మోసపుచ్చడం నాకు చాలా సిగ్గుకలుగజేసేదనీ, ఇప్పటికి తనకి పట్టుబడడం సంభవించిందనీ చెప్పేను. చేసినతప్పు కంతటికీ క్షమార్పణ కోరి ఈరోజునుండి తన కికనేమీ హానిరాకుండా తనజీవితానికేమీ భంగం కలుగకుండా నామార్గాన్ని నేనుపోయి తనయథాస్వేచ్ఛ తనదయేటట్టు చేస్తానని కూడా అన్నాను. 'చెడ్డమార్గాలలో దిగేననడంలో అర్థంఏమిటి?' అంది సత్యవతి. నేనేమీ జవాబుచెప్పలేదు. 'త్రాగుడుఅలవాటయిందా?' అని అడిగింది. 'ఒకటిరెండుమాట్లు త్రాగినా అలవాటు కాలేదు' అన్నాను. 'ఇంకా ఏమి తప్పుపనులుచేసేవు?' అని ప్రశ్నించింది. 'ఏమనిచెప్పను? నేను చెయ్యని తప్పుపని లేదు' అన్నాను. 'నిజంగా?' అని సత్యవతి అంటే 'నిజంగానే' అని జవాబు చెప్పేను. ఒక్క నిముషం కనురెప్పలు మూయ్యకుండా నాకేసి చూసి చూసి చటుక్కున ఏడుపు ప్రారంభించింది. చీర కొంగుతో కళ్లద్దుకుంది. నేను లేచి ఇటూ అటూ పచార్లు మొదలుపెట్టేను. నావంటి మర్యాదహీనుడు లేడని ఒప్పుకున్నాను. మర్యాదస్థుల ఇళ్లల్లోకి రావడానికి నాకు హక్కు లేదన్నాను... సత్యవతి నేనూ మాట్లాడడం ప్రారంభించగానే మరీఏడవడం మొదలుపెట్టేది. తను లేచి లోపలికివెళ్లి పోబోతుంటే త్రోవలో అడ్డంగా నుంచుని నన్ను క్షమించమని బ్రతిమాలుకున్నాను. 'నాతో మాట్లాడవద్దు. నన్ను చూడవద్దు. ఇప్పుడప్పుడే ఈఇంటికి రావద్దు. వెళ్లిపో' అంటూ నన్ను తప్పించుకుని లోపలికి వెళ్లిపోయింది. కృష్ణయ్యగారి భార్య నాతో మాట్లాడడానికి రాకుండానే నేను వారి ఇల్లు విడచి వెళ్లిపోయాను."

"అంతా బాగానే ఉంది కాని ఆ... ఇందిరన్నావిడ సంగతేమిటి?

"చరిత్రంతావిను. తొందరపడకు."

"ఇదొక చరిత్రే ... అంతా ఏదో కప్పల తక్కెడ వ్యవహారంలా ఉంది కాని....."

"ఒకవారంరోజులవరకూ సత్యవతిని చూడడానికి నేను వెళ్ళలేదు. ఉత్తరం మట్టుకొకటి వ్రాశాను. ఉత్తరంలో తను నన్ను మరచిపోతేకాని తనకి మనశ్శాంతి ఉండదన్నాను. మల్లెపువ్వుపరిమళంవంటి స్వభావంకల తను నాదానిగా ఇన్నాళ్ళుండడం తనదురదృష్టం కాని మరొకటి కాదన్నాను. తన సుగుణాలు నేనెప్పటికీ మరచిపోలేనన్నాను. నే నెటువంటివాడనైనా నాహృదయంలో అగ్రస్థానం ఎల్లకాలాలకీ తనదే అన్నాను. అయినా నేనింక తన జీవితంలో జోక్యం కలుగజేసుకోననీ, నాఘోరమైన తప్పులన్నీ క్షమించమనీ వ్రాశాను...సత్యవతిని చూడని వారం రోజులలోనూ ఇందిరని చూడడానికి తరచుగా వెళ్ళేవాడిని. వెళ్ళిన మొదటి మూడునాలుగుసార్లూ ఇందిర నాతో హాయిగా మాట్లాడింది. నరసింహంపంతులుగారుకూడా సరదాగా మాట్లాడేరు. కాని ఆఖరిసారి వెళ్ళినప్పుడు ఆయననడత నాకు చాలావిచిత్రం అనిపించింది. నేను వెళ్ళగానే పత్రిక చదువుతూ కూర్చున్నవారు చటుక్కున లేచి 'చాలా తొందరపను లున్నాయి. క్షమించు' అంటూ లోపలికి వెళ్ళిపోబోయారు. 'ఇందిర ఇంట్లో ఉందా?' అని నేనడిగితే 'లేదు' అని కఠినంగా జవాబిచ్చి లోపలికి వెళ్ళిపోయారు. ఆవేళప్పుడు ఇందిర ఇల్లువదలి బయటకివెళ్ళడం నేనెన్నడూ ఎరుగను. నరసింహంపంతులు గారు అబద్ధం చెప్తున్నారా?' అని అనుమానపడ్డాను. అయినా ఎందుకు నా కాయన అబద్ధంచెప్పాలి? ... నిజంగా ఇందిర ఇంట్లోలేదనే నిశ్చయించుకున్నాను. ఈ విషయమై ఆలోచిస్తూ తిన్నగా సత్యవతిఇంటికి వెళ్ళేను. సత్యవతి బెట్టుసరి చెయ్యకుండా నాదగ్గరికి వచ్చి కూర్చుంది. 'కృష్ణయ్యగారు వచ్చేసేరా?' అని నేనడిగితే 'ఇంకా రాలేద'ని జవాబిచ్చింది. తనంతట తనే నా ఉత్తరం అందిందని చెప్పింది. ఈవారం రోజులూ తను అనుభవించిన దుఃఖం ఇంతా అంతా కాదంది. తన బాధ ఎవరితో చెప్పుకునేందుకూ తోచలేదట. తన స్వంత తల్లికే అంతా విపులంగా చెప్పేందుకు మనస్సొప్పలేదంది. ఒకటిరెండుసార్లు ఎందువల్లనో వెళ్ళి ఇందిరకి తనదుఃఖం అంతా బోధపరచాలని బుద్ధిపుట్టిందట. కాని చూడడానికి వెళ్ళీకూడా ఈవిషయమై ఏమీ మాట్లాడలేదంది... సత్యవతి సావకాశంగా ఈ మాటలన్నీ చెప్తుంటే నాగుండెలో రాయిపడింది. ఒకవైపున 'కొంపతీసి ఇందిరతో నావిషయం అంతా చెప్పేసిందా?' అని కంగారు. మరొకవైపున 'సత్యవతి కోపం అంతా ఎక్కడకి పోయిందా!' అని ఆశ్చర్యం...కాసేపట్లో నాపన్నాగం అంతా వృథా అయిపోయిందని నాకు బోధపడింది. చెడ్డసహవాసంవల్ల చెడ్డమార్గాలలో పడినప్పటికీ నిజానికి నేను దుర్మార్గుడిని కానని తను వారంరోజులు ఏడ్చిఏడ్చి ఆఖరికి గ్రహించానంది. స్నేహితుడెవడైనా దుస్సహవాసంవల్ల పాడవుతున్నాడని కనిపెట్టినప్పుడు ఎవరిదైనా కర్తవ్యం ఆస్నేహితుడిని బాగుపరచడంకాని జరిగేదేదో జరగనివ్వమని ఊరుకోడం కాదంది. తనకర్తవ్యం ఇప్పుడు నన్ను బాగుపరచడం అంది. స్త్రీసాంగత్యం స్త్రీసహాయం కావలసినంతా లేకనే ఇలా నేను పాడయిపోయానన్నమాట నిశ్చయం అంది. కోపాలకీ, తాపాలకీ ఇది సమయం కాదంది. నన్ను బాగుపరచడానికి తను ఆలోచించగలిగినంతవరకు ఒకటే మార్గం కనబడుతోందంది. నాపరీక్ష ఎలాగో అయిపోయింది కనుక, ఎలాగా నేను పరీక్షలో ఉత్తీర్ణుడనవడం స్థిరం కనుక ఉద్యోగం అయేవరకూ పెళ్ళికోసం ఆగకుండా ఎంత త్వరలో మేమిద్దరం పెళ్ళిచేసుకుంటే అంతమంచిదంది. పెళ్ళయాక సోమసుందరం వచ్చి నన్ను పాడు చెయ్యకుండా చూసే బాధ్యత తనదంది. స్త్రీలు ఎంత అసాధ్యమైన కార్యాలైనా సాధించగలరని తనకి తెలుసునంది. కృష్ణయ్యగారు కలకత్తానుంచి రాగానే ఈపెళ్ళిమాట ఆయనకి నన్ను చెప్పమంది. నేనే మరొక కారణానికి తొందరపడుతున్నట్టుగా బోధపరచమంది. పెళ్ళయాక ఉద్యోగం లభించేవరకూ ఇద్దరం వాళ్ళ నాన్నతో ఈఇంట్లోనే ఉండొచ్చునంది... ఈవిధంగా సత్యవతి మాట్లాడుతుంటే నేను మారుమాట్లాడలేకపోయాను. నానోరు కట్టేసినట్టయిపోయింది. నామెదడు జ్వరతీవ్రంలో కొట్టుకుంటున్నవాడిమెదడులా కృశించి

పోయింది. తను నన్నీవిధంగా క్షమించినందుకు ఆనం దిస్తున్నవాడిలా ఏవోనాలుగు తెలివితక్కువముక్కలు విదజల్లి వీథిలోపడ్డాను."

"అయితే ఆవిడ నీతో ఈవిధంగా మాట్లాడడం తల్లిగారి ప్రోత్సాహంవల్లనే అంటావా?"

"సందేహం లేదు."

"నువ్వు దుర్వృత్తులలో దిగేవని తెలిసికూడా నిన్నావిడ వదలదలచుకోలేదన్నమాట."

"నేను చెప్తున్న దేమిటిమరి?"

"నాకు తెలియక అడుగుతున్నాను — స్త్రీలు పురుషులలో మర్యాదస్థులకంటె పోకిరీలని ఎక్కువప్రేమిస్తారట నిజమేనా? మానవస్వభావం సంపూర్ణంగా పరిక్షచేసిన పాశ్చాత్యపండితు డెవడో అన్నాడని విన్నాను."

"ఏమో, ఎవరు చెప్పగలరు? నాకు తెలిసినదల్లా స్త్రీస్వభావం ఈజన్మలో నేనెప్పటికీ బోధపరచుకోలేనని."

"స్త్రీలవిషయమై ఆమాత్రం బోధపరచుకుంటే వాళ్లని పూర్తిగా బోధపరచుకున్నట్టే అంటారు. నేను కూడా వాళ్లను గురించి చర్చ మొదలుపెట్టాలి... ... తర్వాత సంగతి చెప్పు."

"ఇక చెప్పవలసినదంతలేదు. ఇంటికి వచ్చేసరికి ఇందిరదగ్గరనుంచి ఒకఉత్తరం ఇక్కడ పడుంది. ఆ ఉత్తరం చదవగానే ఉన్న ప్రాణం కాస్తా కూడా పోయింది నాకు."

"ఏమిటి వ్రాసిం దావిడ?"

"ఏమి లేమిటి!... సత్యవతివెళ్లి ఇందిరతో ఆ ఆందోళనలో నాచరిత్ర మొదటినుండీ చెప్పేసిం దట."

"ఇప్పుడే కాదూ చెప్పలే దని ఆవిడ చెప్పేరన్నావు నీతో?"

"సత్యవతి నాతో అబద్ధం చెప్పింది."

"ఏమిటి వ్రాసింది. ఆ... ఇందిర న్నావిడ?"

"సత్యవతికీ నాకూ ఉన్న సంబంధం ఇన్నాళ్లూ తనకి తెలియపరచకుండా దాచడంకంటె అవమానమైన నడత మరొకటి లేదని వ్రాసింది. తర్వాత, సత్యవతివెళ్లి నేను లంకా సోమసుందరంతో తిరిగి సారాయిగాయుడ నయాననీ, ముండల ముఠాకోరునయాననీ కూడా చెప్పిందట. సత్యవతికి క్షమార్పణ కోరుతూ నేనీమధ్య వ్రాసిన ఉత్తరంకూడా సత్యవతి ఇందిరకి చూపించిందట. అంతకంటె సిగ్గుచేటు మరొకటి లేదని వ్రాసింది ఇందిర. తనతో నాకిక నేమీసంబంధాని కివీలు లేదనీ, తను నాకు వ్రాసిన ఉత్తరాలన్నీ నేను చింపెయ్యాలనీ, నాఉత్తరాలన్నీ అప్పుడే ముక్కలు ముక్కలుగా మ్యునిసిపల్ బండిలో ప్రయాణం చేస్తున్నాయనీ, చూడడానికి తనఇంటికి నేనెన్నడూ రా కూడదనీ, నన్ను గురించి ఈవిషయాలు కొన్ని తెలియడం వల్ల నరసింహంపంతులుగారుకూడా నేను వారింటికి రాకుండా చూసేటట్టు శపథంపట్టేరనీ తనకి నామోసం వల్ల కలిగిన దుఃఖం జన్మజన్మలకీ మరచిపోలేననీ వ్రాసింది... ఇదీ నాపన్నాగంయొక్క ఫలితం. వదలిపెట్టుందనుకున్న సత్యవతి నన్ను పూర్వం అనుకున్నకంటె ముందుగా పెళ్లిచేసుకుంటానంటుంది. పెళ్లిచేసుకుందాం అనుకున్న ఇందిర నన్నికను చూడనేచూడనంటుంది. ఇవన్నీ ఇలాఉండగా..."

"నే నొకమాట చెప్తాను వింటావా?"

"ఇవన్నీ ఇలాఉండగా లంకాసోమసుందరంతో స్నేహంచెయ్యడంవల్ల పైగా ఇరవై రూపాయిలు క్షవరంకూడాను."

"అదెందువల్ల?"

"వాడు స్నేహం మొదలుపెట్టిన మూడవరోజున ఇరవై రూపాయిలు అప్పిచ్చేవరకూ చంపుకుతిన్నాడు. మంచిమాటచేసుకుంటే ఎందుకైనా మంచిదని వెంటనే అప్పిచ్చేను. ఆ ఇరవై ఈజన్మలో మళ్ళీ నాకంట బడదు."

"భేష్!......ఆ ఇరవై రూపాయిలూ పోతే పోయాయి కాని, నీపెళ్లిమాట..."

"ఇంకా నాపెళ్లిమాటేమిటి? సత్యవతిని నే నెప్పటికీ పెళ్లిచేసుకోను. ఇందిర నాకేసి చూడదింక"

"అందుకేనోయ్...మా మేనమామకి సరిగ్గా నీ వంటివాడే చదువుకున్న అల్లుడు కావాలి. నువ్వు ఎందుకు చేసుకోకూడదూ అతని కూతుర్ని?"

"సరిసరి! ఆసంబంధం ఇలా తప్పించుకోవాలని పన్నాగం పన్నుతున్నావా నువ్వు?"

"తప్పించుకోవాలని కాదు... నిజంగా. మా మేనమామకూతురంటే నాకెంతో అభిమానం. ఆపిల్ల నాతోకంటె నీతో ఎక్కువ సుఖంగా ఉంటుందని నాకు తెలుసును. ఆపిల్లసుఖమే నాసుఖం..."

"కట్టిపెట్టు నీ........."

"చాలా అందమైనది. ఆపైన నీఇష్టం. జుట్టు మోకాళ్లవరకూ వేళ్లాడుతూ ఉంటుంది. శరీరచ్ఛాయ చెప్పనలవికాదు..."

"అంతనలువా?"


"అదా నువ్వుతీసేఅర్థం! ......పేరు విలాసిని. శృంగారాలొలికేపేరు. చదువుకి లోటులేదు. భారత భాగవతాలు అమాంతంగా అప్పచెప్పగలదు."

"ఇంగ్లీషు రాదా?"

"ఇంగ్లీషా?·కొంచెం వచ్చునసే బుకారు...... పదివేలదాకా కట్నం ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నాడు మా మేనమామ."

"పదివేలే! ...ఎన్నేళ్లాపిల్లకి?"

---



మ్యూజియము-తిరువనంతపురము A. A. C.